క్లుప్తంగా

కొనసాగిన పవిత్రోత్సవాలు



అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాల్లో భాగంగా విశేష పూజలు చేస్తున్న పండితులు

పెరవలి: అన్నవరప్పాడులోని వేంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలు వేద పండితుల సమక్షంలో ఘనంగా ఆదివారం మూడో రోజు కూడా ఘనంగా నిర్వహించారు. స్వామివారికి తెల్లవారుజామున అభిషేకం నిర్వహించాక, పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉదయం, మధ్యాహ్నం వివిధ రకాల పూజలు జరిగాయి.గోపాలపురం గ్రామానికి చెందిన మీసాల రాధాకృష్ణ కుటుంబం పూజాదికాలు నిర్వహించింది. వేద పండితులు ఖండవల్లి రాజేశ్వరరావు, వర ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవ, యాగాగ్ని కార్యక్రమాలు నిర్వహించారు. కడింపాడు, మల్లేశ్వరం, పిట్టల వేమవరం, దొంగరావిపాలెం భక్తులు ఈ పవిత్రోత్సవాలను తిలకించారు.

రోగికి ఆర్థిక సాయం

గోపాలపురం: పక్షవాతంతో బాధపడుతున్న వేళ్లచింతలగూడేనికి చెందిన చిడిపి చినరత్తయ్య అనే రోగికి ఆదివారం మానవత సంస్థ మండల సభ్యులు రూ.3 వేల నగదు సాయం చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండల శాఖ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, కార్యదర్శి కుక్కల కీర్తికుమార్, కె.నాగరాజు పాల్గొన్నారు.

రేపు కోటసత్తెమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయ హుండీని మంగళవారం ఉదయం 8 గంటలకు తెరిచి, లెక్కించనున్నట్లు ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాశ్ ఆదివారం తెలిపారు.

కొత్త విద్యుత్ లైన్‌తో వృక్ష విలాపం



దేవరపల్లి మూడు బొమ్మల సెంటర్లో కొమ్మలు తొలగించిన శతాబ్ద కాలం నాటి చింత చెట్టు

దేవరపల్లి: దేవరపల్లిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న రెండో టౌన్ ఫీడర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి రామన్నపాలెం రోడ్డు వరకూ సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా రెండో టౌన్ ఫీడర్ నిర్మాణం చేపట్టారు. ఈ ఫీడర్ నిర్మాణంలో భాగంగా 12.5 మీటర్ల ఎత్తు గల స్తంభాలు ఏర్పాటు చేస్తుండడంతో, ఈ లైన్‌కు అడ్డుగా ఉన్న శతాబ్దకాలం నాటి వృక్షాలు నేలకొరుగుతున్నాయి. స్థానిక మూడుబొమ్మల సెంటర్లోని చింత చెట్టు విద్యుత్ లైన్‌కు అడ్డు రావడంతో సగభాగం తొలగించారు. ఎన్నో ఏళ్లుగా ఈ వృక్షం ఎంతో మందికి నీడ నిస్తోంది.వేసవిలో చుట్టుపక్కల ప్రజలు, వృద్ధులు చెట్టు కింద చేరి సేద తీరేవారు. పలువురు చిరు వ్యాపారులు ఈ చెట్టు కిందే వ్యాపారాలు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. పెద్దపెద్ద కొమ్మలను చెట్టు నుంచి తొలగించడంతో మూడు బొమ్మల సెంటర్ బోసిపోయిందని స్థానికులు వాపోతున్నారు. చెట్టుకు వందేళ్లకు పైగా వయసు ఉంటుందని స్థానికులు తెలిపారు. చెట్టు కింద సేద తీరుతున్న వృద్ధులు చెట్టు వంక దీనంగా చూస్తున్నారు.

కట్నం వేధింపులపై కేసు

కొవ్వూరు: అదనపు కట్నం కోసం వేధిస్తున్న అభియోగంపై మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన తాతపూడి సుందర విజయ్ కిరణ్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులపై కూడా కొవ్వూరు పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. అదనపు కట్నం కోసం తనను భర్త శారీరకంగాను, మానసికంగాను వేధిస్తున్నట్టు సుందర విజయ్ కిరణ్ భార్య స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఏఎస్సై జీజీ ప్రకాశ్ తెలిపారు. మద్యానికి బానిసై అదనపు కట్నం తీసుకుని రావాలని తనను వేధిస్తున్నట్టు, అందుకు అత్త మామలు సహకరిస్తున్నట్టు స్రవంతి తన ఫిర్యాదులో పేర్కొంది. ఈనెల 22న తనను ఇంటి నుంచి గెంటి వేశారని పేర్కొంది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నల్లజర్ల: మండలంలోని మారెళ్లమూడిలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.3 వేల స్వాధీనం చేసుకున్నట్టు నల్లజర్ల ఎస్‌ఐ సోమరాజు తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న నలుగురి అరెస్ట్

గోపాలపురం: దొండపూడి పంచాయతీ పరిధిలోని సాగిపాడు గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందేలపై గోపాలపురం పోలీసులు ఆదివారం దాడి చేశారు. రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులను, రూ.3,400 నగదు స్వాధీనం చేసుకుని, పందేలు ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపారు.

పీహెచ్‌సీలలో 63 రకాల పరీక్షలు

- శిక్షణ పూర్తి చేసుకున్న ల్యాబ్ టెక్నీషియన్లు
- ఆసుపత్రులకు పరికరాలు
- ఇది జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే

నల్లజర్ల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ సేవలు మరింతగా పెరిగాయి. ఇందుకోసం వైద్య,ఆరోగ్య శాఖ అధునాతన యంత్ర పరికరాలను పీహెచ్‌సీలకు సమకూర్చింది. ఒక్కో పీహెచ్‌సీకి సీబీసీ, ఎలక్ట్రోలైట్ ఎన్‌లైజర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, యూరిన్ ఎన్‌లైజర్, టీబీ ఆర్‌టీ పీఆర్ వంటి యంత్ర పరికరాలను సమకూర్చారు. ఇన్నాళ్లూ పీహెచ్‌సీల్లో కేవలం 15 నుంచి 20 రకాల ల్యాబ్ పరీక్షలు మాత్రమే చేసేవారు. ప్రస్తుతం వాటి సంఖ్య 63కు పెరిగింది. ఇందుకోసం ప్రతి పీహెచ్‌సీకి ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను కూడా నియమించారు. వారికి 22 రోజుల పాటు శిక్షణ కూడా ఇచ్చారు. ఈ శిక్షణ రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ జనరల్ హాస్పటల్ జరిగింది.

గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయం మేరకే..

జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల వైద్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. రూ.ఐదు లక్షలు ఉండే ఆరోగ్యశ్రీ వైద్య సేవల పరిమితిని రూ. 25 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. గ్రామీణులకు కూడా వైద్య నిపుణులతో సేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో వైద్య శిబిరాలు కూడా నిర్వహించింది. వైద్య పరీక్షల కోసం పేదలు పట్టణ ప్రాతాలకు వెళ్లాల్సిన అవసరం రాకుండా పీహెచ్‌సీలలోనే ఆ ఏర్పాటు చేయాలని సంకల్పించింది. జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకే ఇప్పుడు ప్రాథమిక వైద్య కేంద్రాల్లోని ల్యాబ్ పరీక్షలు 63కు పెరిగాయి.



పీహెచ్‌సీకి చేరిన అధునాతన ల్యాబ్ పరికరాలు

ఎంతో మేలు..

లోగడ పీహెచ్‌సీలలో అన్ని రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉండవి కాదు. దాంతో రోగులు ఏరియా ఆసుపత్రి, జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి వెళ్లేవారు. సహజంగానే వారిపై ఆర్థిక భారం పడేది. దీనికితోడు అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దూర ప్రాంతాలకు వెళ్లలేని కొంత మంది రోగులు ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించేవారు. ప్రస్తుతం ల్యాబ్ సేవలు పెరగడంతో రోగులకు ఉపయుక్తంగా ఉందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పలివెల ప్రసాద్ చెప్పారు.

చేసే పరీక్షలు ఇవే..

సీఆర్‌పీ, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ, యూఆర్‌ఈఏతో పాటు హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్ కౌంట్, సీబీసీ, టోటల్ బ్లడ్ సెల్‌కౌంట్, ర్యాండమ్ బ్లడ్ షుగర్, బ్లడ్ యూరియా, సీరం సోడియం, హెచ్‌ఐవీ, హెపటైటిస్-బి, డెంగీ, బ్లీడింగ్, క్లాటింగ్ టైమ్, థైరాయిడ్, పొటాషియం, క్లోరైడ్ తదితర 63 రకాల పరీక్షలు చేస్తున్నారు.

పరికరాలు పీహెచ్‌సీకి చేరాయి



వివిధ రకాల వైద్య పరీక్షలకు అవసరమైన పరికరాలు, మెషినరీ పీహెచ్‌సీకి చేరాయి. పరీక్షలు ఏవిధంగా చేయాలనే అంశంపై నాకు శిక్షణ ఇచ్చారు. పీహెచ్‌సీల్లో పేదలకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నాం.

ఎస్‌డీ ఉనూర్ షరీఫ్, ల్యాబ్ టెక్నీషియన్, నల్లజర్ల పీహెచ్‌సీ

అందుబాటులోకి..



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలు పెంచేందుకు అనుగుణంగా పరికరాలు అందించారు. 63 రకాల పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. అన్నిరకాల పరీక్షలు పేదలకు ఇక్కడే అందుబాటులో ఉన్నాయి. పరీక్షలు కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్ళనవసరం లేదు.

-డాక్టరు తెల్లం గంగాధరరావు, పీహెచ్‌సీ వైద్యుడు, నల్లజర్ల

8 వరకూ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు



తాళ్లపూడిలో గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవీంద్రనాథ్

తాళ్లపూడి (కొవ్వూరు): రెండు రోజులుగా తాళ్లపూడి మండలంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు 120 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ రవీంద్రనాథ్ ఆదివారం తెలిపారు. మండలంలోని 44 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారన్నారు. ఆదివారం ఇరవై పోలింగ్ కేంద్రాలను తాను తనిఖీ చేసినట్టు తెలిపారు. డిసెంబర్ 5న జరిగే టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు. మొత్తం 61 మంది టీచర్ ఓటర్లుగా నమోదయ్యారన్నారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలు కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రతి గ్రాడ్యుయేట్ జాబితాలో తమ ఓటు ఉందో లేదో చూసుకోవాలని సూచించారు. లేకపోతే వచ్చే నెల 8వ తేదీ లోగా కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలో నమోదైన 1,746 మంది గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల కోసం మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

అభ్యుదయ సాంకేతిక దృక్పథంతో బోధన

- ఉపాధ్యాయులు పోరాట పటిమతో ఉండాలి
- ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు
- నిడదవోలులో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ
- పట్టణంలో భారీ ర్యాలీ

నిడదవోలు: ఉపాధ్యాయులు సామాజిక స్పృహతో పాటు పోరాటపటిమ కలిగి ఉండాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. యూటీ ఎఫ్ జిల్లా నూతన కౌన్సిల్, స్వర్ణోత్సవ సభను ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమ సమాజాన్ని నిర్మించే పౌరులను తయారు చేయాలంటే ఉపాధ్యాయులు అభ్యుదయంగా ఆలోచిస్తూ సాంకేతిక దృక్పథంతో బోధించాలన్నారు. ప్రజా పోరాటాల వల్లే ఏదైనా సాధించుకోగలమన్నారు. 50 ఏళ్ల ఉద్యమ చరిత్రలో యూటీఎఫ్‌కు ఎన్నో విజయాలు ఉన్నాయన్నారు. మాజీ ఎంపీ మిడియం బాబురావు తన ప్రసంగంలో నూతన ఆర్థిక విధానాలను ఉపాధ్యాయులకు వివరించారు. యూటీఎఫ్ జాతీయ కార్యదర్శి ఎన్. అరుణకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఉపాధ్యాయులకు రావలసిన అనేక అలవెన్సుల సాధనకు భవిష్యత్తులో జరిగే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి షరీఫ్ తన ప్రసంగంలో రోజురోజుకూ కొత్తగా పుట్టుకొస్తున్న యాప్‌లు బోధన సమయాన్ని హరించేస్తోందన్నారు. అంతకు ముందు నిడదవోలు పట్టణంలో యూటీఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన ఉపాధ్యాయులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్, కేవీపీఎస్ నాయకుడు జువ్వల రాంబాబు, యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, నాయకులు కె. వెంకటేశ్వరరావు, కె.పార్థసారథి, ఈవీవీఎస్ ప్రసాద్, శంకరుడు, ఎం విజయగౌరి, ఐ.రాంబాబు, జిల్లా కార్యదర్శి ఈ శ్రీమణి, ఎం శ్రీనివాస్, కె. రమేష్ బాబు, రాష్ట్ర కౌన్సిలర్లు, వివిధ మండలాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న టీచర్స్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

అంతిమ సంస్కార సేవలకు నిర్ణయం

- త్వరలో ప్రారంభించాలని నల్లజర్లలో తీర్మానం

నల్లజర్ల: ఈ ప్రాంత వాసుల కోసం త్వరలో అంబులెన్స్, కైలాసరథం, మార్చురీ ఫ్రీజర్ అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ పాలకవర్గం తీర్మానించింది. నల్లజర్లలోని ఆ సంస్థ కార్యాయలంలో మండల శాఖ అధ్యక్షుడు మహ్మద్ ఇలియాస్ షరీఫ్ అధ్యక్షతన ఆదివారం పాలకవర్గ సమావేశం జరిగింది. పదేళ్లుగా నిర్వహిస్తున్న విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌లు, స్కాలర్ షిప్‌లు, బడి తర్వాత విద్యాబోధన, ఉచిత కుట్టుశిక్షణ కార్యక్రమాలు సంస్థకు మంచి పేరు తీసుకు వచ్చాయని సభ్యులు అభిప్రాయపడ్డారు. ప్రజాసేవే పరమావధిగా సంస్థ పని చేయాలని సభ్యులు కోరారు. పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ జాతీయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు సాగుతున్నట్టు వివరించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కూరపాటి నాగరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు గోతం సత్యలక్ష్మి, విద్యా విభాగం చైర్మన్ బొందల శ్రీనివాసరావు, కోశాధికారి జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశమైన పార్డ్ ఇండియా సంస్థ పాలకవర్గం

ఉమారామలింగేశ్వరునికి లక్ష బిల్వార్చన



దేవరపల్లి ఉమారామలింగేశ్వరస్వామి గుడిలో పార్వతీదేవికి కుంకుమ పూజలు



చాగల్లులో జ్యోతిర్లింగార్చన

దేవరపల్లి: కార్తిక మాసం సందర్భంగా దేవరపల్లిలోని పార్వతీ సమేత ఉమారామలింగేశ్వరస్వామి వారికి ఆదివారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన, కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి లక్ష బిల్వార్చన, మహిళలు అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. అనంతరం స్వామి ఆలయ ప్రాంగణంలో లింగాకార దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కాపు సంఘం నాయకులు, అర్చకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చాగల్లు: కార్తిక మాసం సందర్భంగా ఆదివారం మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.జ్యోతిర్లింగార్చన జరిగింది. చాగల్లు రాజరాజేశ్వరి స్వామి, బ్రాహ్మణగూడెం బాల రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి వారికి పూజలు చేశారు. చాగల్లు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. చిక్కాల,ఊనగట్ల, మార్కొండపాడు ఉమా మార్కండేయ స్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఐక్యతకు వేదికలు వన సమారాధనలు

నిడదవోలు: కార్తిక వన సమారాధనలు వివిధ సంఘాల ఐక్యతకు వేదికలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య సేవా సంఘం, తూర్పు కాపు సంఘం, కమ్మసంఘం, తూర్పు కాపు విద్య వైజ్ఞాన అభివృద్ధి సంఘాల కార్తిక వనసమారాధనల్లో మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. వన సమారాధనలతో మహిళలు, చిన్నారులు, యువత ఉత్సాహంగా గడిపారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల సభ్యులు మంత్రి దుర్గేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఆర్యవైశ్య సేవా సంఘ అధ్యక్షుడు కేదారిశెట్టి రవికుమార్, కార్యదర్శి నెప్రూరా, కోశాధికారి వలివేటి సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘ మహిళా విభాగం అధ్యక్షురాలు కేదారిశెట్టి పద్మిని, కార్యదర్శి సునీత, కోశాధికారి జయవరపు లక్ష్మీసుభద్ర, కేదారిశెట్టి కాశీవిశ్వనాథం, జయవరపు గోపాల్, గ్రంధి బాలాజీ, కంకిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: కార్తిక మాసంలోని చివరి ఆదివారం కావడంతో వనాలన్నీ సందడిగా మారాయి. మండలంలోని వివిధ కుల సంఘాలు, వృత్తి సంఘాల వారు కార్తిక వనసమారాధనలు నిర్వహించుకున్నారు.తెలికిచెర్ల గ్రామంలో రైతు తమ్మిశెట్టి రామారావు, నాగమణి దంపతుల ఆధ్వర్యంలో వన భోజనాలు ఏర్పాటు చేశారు. వేద పండితుడు మణిశర్మ ఆధ్వర్యంలో భద్రావతి భావనారాయణుల కల్యాణం, రమా సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. బంధువులు, మిత్రులు, గ్రామస్తులకు వన భోజనం ఏర్పాటు చేశారు. దూబచర్ల, పోతవరం, పోతినీడుపాలెం గ్రామాలలో వనభోజనాలు జరిగాయి.



ఆర్యవైశ్య సేవా సంఘం వన సమారాధనలో బహుమతులు గెలుచుకున్న మహిళలు



తెలికిచెర్లలో ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

చదువులమ్మ చెట్టు నీడలో..

ఉండ్రాజవరం: పూర్వ విద్యార్థులు 44 ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకుని సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల 1979–80 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు మండలంలోని మోర్త గ్రామంలోని కంటిపూడి శ్రీనివాసరావు ఇంటి వద్ద ఆదివారం సమావేశమయ్యారు. శ్రీనివాసరావు కూడా ఆ బ్యాచ్ విద్యార్థే. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పేరు పెట్టి పిలచుకుంటూ, కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చదివిన రోజుల్లో జ్ఞాపకాలను, చేసిన అల్లరి చేష్టలను గుర్తు చేసుకున్నారు. చదువు చెప్పిన అప్పటి గురువులను స్మరించుకున్నారు.



ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల 1979-80 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల సందడి

డిసెంబర్‌లో రేషన్ షాపుల్లో కందిపప్పు

దేవరపల్లి: డిసెంబర్‌లో ప్రతి రేషన్ కార్డుకూ కందిపప్పు సరఫరా చేసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు నూరు శాతం కందిపప్పుకు డీడీలు చెల్లించాలని రేషన్ డీలర్లకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మండల స్థాయి గిడ్డంగుల నుంచి కందిపప్పు రేషన్ దుకాణాలకు చేరవేస్తున్నారు. డిసెంబరు ఒకటో తేదీ నుంచి కిలో రూ.67 రేటుకు కందిపప్పు, అరకిలో రూ.17 రేటుకు పంచదార ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తారని దేవరపల్లి మండల సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ ఎ.సత్యనారాయణ తెలిపారు.

మాక్ పోలింగ్‌తో సిబ్బందికి అవగాహన



నల్లజర్లలో ఓటరు జాబితాల సవరణ శిబిరం ఫ్లెక్సీతో తహసీల్దార్ కృష్ణారావు, ఓటరు నమోదు సిబ్బంది



పెరవలి పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ అచ్యుత కుమారి



దేవరపల్లిలో ఓటర్ల నమోదు కేంద్రంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి

పెరవలి: మాక్ పోలింగ్ ద్వారా పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ సిబ్బందికి విధులు ఎలా నిర్వర్తించాలో అవగాహన కల్పిస్తున్నామని తహసీల్దార్ డి.అచ్యుత కుమారి చెప్పారు. పెరవలి నంబర్-1 పాఠశాలలో ఎన్నికల సిబ్బందికి ఆదివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లకు, సిబ్బందికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా మాక్ పోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలింగ్ సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో మార్పులు చేయించుకున్న 97 మంది

నల్లజర్ల: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం రెండు రోజుల పాటు మండలంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరాలకు స్పందన అంతంత మాత్రంగా ఉంది. మొదటి రోజు 46 మంది, రెండో రోజు 53 మంది ఈ శిబిరాల సేవలను సద్వినియోగం చేసుకున్నారు. తహసీల్దారు కృష్ణారావు, ఆర్ఐ, వీఆర్వోలు తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌ల వద్ద సాయంత్రం ఐదు గంటల వరకూ ఉండి పర్యవేక్షించారు.

కొత్త ఓటర్ల నమోదుకు ఆరు అర్జీలు

ఉండ్రాజవరం: మండలంలోని పోలింగ్ బూత్‌ల వద్ద రెండో రోజు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటు నమోదు కేంద్రాల్లో కొత్తగా ఓటరు నమోదు కోసం ఆరు అర్జీలు అందినట్టు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ తెలిపారు. తాడిపర్రు, ఉండ్రాజవరం తదితర గ్రామాల్లోని ఓటు నమోదు కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఓటు తొలగింపునకు 10, సవరణలు, బదిలీలకు 11 అర్జీలు అందినట్టు తెలిపారు.

నమోదు కేంద్రాల పరిశీలన

దేవరపల్లి: ఓటర్ల నమోదు కేంద్రాలను ఆదివారం అధికారులు పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదుకు వచ్చిన దరఖాస్తులు, చేర్పులు, మార్పుల ప్రక్రియ, ఓటర్ల కార్డులకు ఆధార్ అనుసంధానం కార్యక్రమాలను తహసీల్దార్ కె. రాజ్యలక్ష్మి, ఎంఈఓ ఎం.తిరుమలదాస్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు శని, ఆదివారాలు మండలంలోని 67 పోలింగ్ కేంద్రాల్లో కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండలంలో కొత్త ఓటర్ల నమోదుకు (ఫారం-6) 25, చనిపోయిన ఓటర్ల తొలగింపు (ఫారం-7)కు 13, ఓటర్ల జాబితాలో మార్పులు, ఇతర ప్రాంతాలకు బదిలీకి ఎనిమిది దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ కె. రాజ్యలక్ష్మి తెలిపారు.